

ఆలయాల భూముల చుట్టూ అక్రమార్కులు వాలిపోయారు. దేవుడికి మొక్కి రూ.కోట్ల విలువైన స్థలాలను నొక్కేసే పరిస్థితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దర్శనమిస్తోంది. అటువంటివారికి రాజకీయం దన్నుగా నిలవడం.. దేవాదాయ శాఖ అధికారులు వంత పాడడం పరిపాటైంది. కీలక దస్త్రాలూ మాయమవుతున్నాయి. న్యాయపరమైన చిక్కులు తెరమీదికి వస్తున్నాయి. రాజుల కాలం నుంచి ఆలయాల ధూప దీప నైవేద్యాలకు నిర్దేశించిన దేవుడి మాన్యానికి.. దాతలు ఉదారతతో రాసిచ్చిన సత్రం భూములకు రక్షణ లేకుండా పోయింది.

- ఈనాడు, కాకినాడ
- న్యూస్‌టుడే, గాంధీనగర్

దేవుడా.. నీ భూమీ వదల్లేదు!

రూ.కోట్ల విలువైన మాన్యం, సత్రం స్థలాలు స్వాహా

1600 ఎకరాలు కాదు.. 18 మాత్రమే

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములు కర్పూరంలా కరిగిపోయాయి. ఒకప్పుడు దేవస్థానానికి 1,600 ఎకరాలు ఉంటే.. ప్రస్తుతం ఆధీనంలో ఉన్నది 18 ఎకరాలే. ఆలయ ఇనాం భూముల చేతులు మారి కొత్త యజమానులు పుట్టుకొచ్చారు. ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంది. భక్తుల కానుకల మీదే ఆధారపడే పరిస్థితి.

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఆలయాలు, సత్రాలు, మఠాలకు చెందిన రూ.కోట్ల విలువైన భూములు ఉన్నాయి. వీటిలో కొన్ని లీజుల్లో ఉండగా దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం అంతంతే. దశాబ్దాలుగా ఒకరి చేతుల్లోనే ఉండడం.. తక్కువ మొత్తానికి లీజుకు తీసుకుని అధిక మొత్తానికి బయటి వ్యక్తులకు భూములు, భవనాలు లీజుకు ఇవ్వడంపైనా చర్యలు లేవు.

- కాకినాడ జిల్లాలో టైటిల్ వివాదాల్లో 541.17 ఎకరాలు ఉంటే.. కోనసీమలో 366.26 ఎకరాలు, తూర్పు గోదావరిలో 33.57 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 491 ఆలయాలు, సత్రాల ఆస్తులు 9,997.03 ఎకరాలు ఉంటే.. ఇందులో 1,580.75 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి.
- అటవీ, కొండ ప్రాంతాల్లోనూ ఆలయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 626.87 ఎకరాలు, తూర్పులో 68.99 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. వీటిలోనూ ఆక్రమణలే.
- దేవాదాయ శాఖ ఖాళీ భూములు కాకినాడ జిల్లాలో 2.43 లక్షల చదరపు గజాలు, తూర్పులో 4.09 లక్షల చ.గ, అంబేడ్కర్ కోనసీమలో 2.13 లక్షల చ.గ చొప్పున ఉన్నాయి. వీటి నుంచి లీజుల ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశమున్నా చొరవ చూపడంలేదు.

ఉమ్మడి జిల్లాలో ఆస్తులు - ఆక్రమణల చిత్రమిదీ..

- ఆలయాలు / సత్రాలు: 1,852
- లీజుకు ఇచ్చినది 20,671.42 ఎకరాలు
- భూములు 38,963.69 ఎకరాలు
- ఆక్రమణలు /వివాదాల్లో ఉన్న భూములు: 5,281.66 ఎకరాలు

ఆక్రమణల చెరలో..

- కాకినాడలోని బొగ్గవరపు సుబ్బారావు సత్రం భూములపై కొందరు కన్నేశారు. సర్పవరంలోని ఎకరం భూమిని కబ్జా చేసేందుకు గత ప్రభుత్వంలో కొందరు ప్రయత్నించారు. న్యాయపరమైన చిక్కులు తెరమీదికి తెచ్చారు. హెచ్చరిక బోర్డులు పెట్టినా రక్షణ లేదు.
- జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మసత్రానికి 781.53 ఎకరాల భూమి ఉంటే.. 113.37 ఎకరాల్లో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. 9.21 ఎకరాలు ఆక్రమణల్లో ఉంది. పరాధీనంలో ఉన్న భూముల విలువ రూ.100 కోట్లకుపైనే.
- గండేపల్లి మండలం తాళ్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయానికి 228.46 ఎకరాలు ఉన్నాయి. పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ భూ సేకరణకు 70 ఎకరాలు పోతే.. 90 ఎకరాలు ఆక్రమణకు గురయ్యింది. అర్చకుల ఆధీనంలో ఉండాల్సిన 60 ఎకరాల సర్వీసు ఇనాం భూమిలో 40 ఎకరాలకు పైగా చేతులు మారింది.



పరాధీనంలో ఉన్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములు

ఆక్రమణలు తొలగిస్తాం

ఆలయ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.. వాటిని తొలగించి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. మూడు జిల్లాల ఈవోలతోనూ సమీక్షిస్తాను. ఎక్కడెక్కడ ఆక్రమణలు, న్యాయపరమైన సమస్యలు ఉన్నాయో తెలుసుకుంటాను. ఆస్తుల లీజులపైనా దృష్టిసారిస్తాం.



- డి.ఎల్.వి.రమేష్‌బాబు, డీసీ, దేవాదాయశాఖ

కొత్త సర్కిళ్లు.. వెలుగులు

- విద్యుత్తుశాఖ విభజన పూర్తి
- కోనసీమలోనూ ఎస్‌ఈ కార్యాలయం



ఈనాడు, రాజమహేంద్రవరం: న్యూస్‌టుడే, దేవీచౌక్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పునర్విభజన జరిగి రెండున్నరేళ్లవుతున్నా ఇన్నాళ్లు తూర్పు విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో విభజన జరగలేదు. దీంతో పొరుగుజిల్లాల్లో ఇబ్బందులు తలెత్తేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సౌకర్యార్థం రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న విద్యుత్తు సర్కిల్ కార్యాలయాన్ని తూర్పుగోదావరి (రాజమహేంద్రవరం), కాకినాడ, కోనసీమ (అమలాపురం)గా విభజిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరి ఇప్పుడు ఏడు డివిజన్లు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు ఉన్న రంపచోడవరం డివిజన్‌ను పాడేరు కేంద్రంగా ఏర్పడిన కొత్త సర్కిల్‌లో విలీనం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఉన్న నిడదవోలును తూర్పులో కలిపారు. అమలాపురంలోని ఈఈ కార్యాలయం, కాకినాడ డివిజన్ పరిధి రెవెన్యూ విభాగంలో ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటుచేశారు.

సిబ్బంది సర్దుబాటు

ఉమ్మడి జిల్లాలోని అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది కలిపి 3968 మంది ఉండగా రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో 101 మంది వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరానికి 56, అమలాపురం-51, కాకినాడ సర్కిల్‌కు 52 మందిని కేటాయించారు. కొత్త సర్కిళ్లకు ఎస్‌ఈ, మరో ముగ్గురి నుంచి ఇద్దరు గురు అధికారుల చొప్పున నియమించిన ప్రభుత్వం ఇతర సిబ్బంది నియామకంపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

విద్యుత్తు కనెక్షన్లు కేటగిరీ వారీగా..

జిల్లా	గృహాలు	వ్యాపార/ వాణిజ్యం	పరిశ్రమలు	ప్రభుత్వ సంస్థలు	వ్యవసాయ / ఆక్వా	హెచ్‌టీ
తూర్పుగోదావరి	6,34,061	76,905	2866	12,999	46,806	566
కోనసీమ	5,36,149	62795	2088	15,261	21,344	270
కాకినాడ	6,55,427	75,682	2495	15,381	24,600	634

కొత్త సర్కిల్ వారీ కేటాయింపు..

అధికారి	రాజమహేంద్రవరం	కాకినాడ	కోనసీమ
ఎస్‌ఈ	1	1	1
ఈఈ	3	3	2
డిప్యూటీ ఈఈ	6	6	6
ఏఈఈ	14	12	11
జేఈ	5	4	4
ఏఓ	1	0	1
ఎస్‌ఏఓ	0	1	1
జేఏఓ	4	3	3
సీనియర్ అసిస్టెంట్	11	11	11

(ఏవో, డీజీఎం/పీవోలను మూడు జిల్లాలకు ఒక్కొక్కరి చొప్పున.. జూనియర్ అసిస్టెంట్లను ఒక్కో సర్కిల్‌లో 9 మంది చొప్పున నియమించారు)

జిల్లా వారీ డివిజన్లు ఇలా..

- తూర్పుగోదావరి: రాజమహేంద్రవరం నగరం, రాజమహేంద్రవరం గ్రామీణం, నిడదవోలు
- బీఆర్ అంబేడ్కర్ కోనసీమ: అమలాపురం, రామచంద్రపురం
- కాకినాడ జిల్లా: కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట

ఎక్కడుంది.. ఏమైంది?



వర్షాలతో చిరుత అన్వేషణకు ఆటంకం

కడియం, న్యూస్‌టుడే: కడియం నర్సరీలలోకి చొచ్చుకువచ్చిన చిరుతపులి జాడ నాలుగో రోజు కూడా లభ్యంకాలేదు. మరోవైపు జోరుగా కురుస్తున్న వర్షాలతో అటవీ అధికారుల అన్వేషణకు ఆటంకం కలుగుతోంది. కడియపులంకలోని పలు ప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాల్లో శుక్రవారం ఆనవాళ్లు నమోదు కాలేదు. భారీ వర్షం వల్ల చిరుత బయటకు రాకపోయి ఉండవచ్చని సిబ్బంది తెలిపారు. ఇప్పటికే రెండు బోనులు, 20 ట్రాప్ కెమెరాలు, నాలుగు నిఘా కెమెరాలను ఏర్పాటుచేశారు.

వదంతులు నమ్మొద్దు

రాజవోలుకు చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫోన్‌చేసి కడియం ఆవలో చిరుత సంచరిస్తుందంటూ సమాచారాన్ని అందించాడు. ఉరుకులు పరుగులు తీసిన అటవీ సిబ్బంది అక్కడ పలు రకాల పాదముద్రలను పరిశీలించారు. ఆలమూరు మండలం చొప్పెల్ల నుంచి ఇదే తరహాలో సమాచారం రావడంతో మరో బృందం అటు వెళ్లింది. పరిశీలించి ఆ ప్రాంతాల్లో చిరుత సంచారం లేదని నిర్ధారించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫొటోలు, వీడియోలు చూసి అవి ఈ ప్రాంతంలోనివిగా భావించవద్దని అటవీ అధికారులు తెలిపారు.

గ్రామాల్లో ఆందోళన

కడియం శివారుతో పాటు కడియపు లంక, బుర్రిలంక, దోశాలమ్మకాలనీ, వెంకాయమ్మపేట, పొట్టిలంక, వీరవరం తదితర గ్రామాల్లో చిరుత ఉనికితో ఆందోళన కొనసాగుతోంది. వివిధ పనులపై వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. కాగా ఏడాది పాటు పెంచి పోషించిన నర్సరీలలోని మొక్కలను విక్రయించే సమయమిది. ఈ దశలో చిరుత సంచారంతో వాటి ఎగుమతులు, దిగుమతులు నిలిచాయి. ఇది రైతులపైనే గాక లారీ యజమానులపైనా ఆర్థికంగా ప్రభావం చూపుతోంది.



నిఘా కెమెరాలలో నమోదైన చిత్రాలను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

దేవాదాయశాఖ డీఈఓగా నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా దేవాదాయశాఖ అధికారిగా (డీఈఓ) కె.నాగేశ్వరరావు శుక్రవారం రాజమహేంద్రవరం శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఉపకమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన జిల్లా డీఈఓగా పదోన్నతి పొందారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను దేవాదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసాచార్యులు, అర్చక సంఘ ప్రతినిధులు ఖండవల్లి కిరణ్ కుమార్ ఆచార్యులు, వై.సాయి మాధవాచార్యులు, చందు, ముక్తేశ్వరం అర్చకులు శ్రీకంఠం బాబీ, కాల్లకూరి సాంబమూర్తి, పూజ్యం మణికుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడి డీఈఓ వి.సోమరాజు కాకినాడ ఉపకమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.



బాధ్యతలు స్వీకరిస్తూ..



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు


రాజానగరం: తూర్పుగోదావరి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, దేశ ఆర్థిక మూలాలు బలోపేతం కావడంలో ఈ రంగం కీలకంగా ఉంటుందన్నారు. సాంస్కృతిక, సామాజిక పరంగా ఆయా ప్రాంతాలు ఎంతో ప్రాచుర్యం పొందుతాయన్నారు. గుజరాత్‌లో సబర్మతి ఆశ్రమం, మైసూరులో దసరా వేడుకలు.. గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పడవ పందాల గురించి ప్రస్తావించారు. వేదంలా ఘోషించే గోదావరి గేయంతో ఈ ప్రాంతం ఎంతో గుర్తింపు పొందిందన్నారు. వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ టూరిజం అండ్ హాస్పటాలిటీ కోర్సును 2015లో విశ్వవిద్యాలయంలో ప్రారంభించామన్నారు. మండపాక నాగలక్ష్మి, ఆచంట చంద్రశేఖర్, కె.రాజరాజేశ్వరి, జి.ఎస్.ఎల్.ఎన్.శర్మను కలెక్టర్, వీసీ జ్ఞాపికలు, దుశ్శాలువతో సత్కరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్. ఉదయ్‌భాస్కర్, పర్యాటకరంగ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, బి.అన్వర్‌హుస్సేన్, కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, అధికారులు

లైసెన్సులు ఉంటేనే బాణసంచా విక్రయాలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): ప్రభుత్వ నిబంధనల మేరకు లైసెన్సు కలిగిన వారే దీపావళి బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించాలని ఎస్పీ డి.నరసింహకిషోర్ తెలిపారు. సామగ్రి తయారీ, సరఫరా, విక్రయాలు చేసే వారిపై నిఘా ఉంచామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ చేసిన గోదాములు, విక్రయ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేసినట్లు తెలిపారు. బాణసంచా గోదాములు, తయారీ, విక్రయాల కేంద్రాలు నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. అగ్నిమాపక యంత్రాలతోపాటు పొడి ఇసుక, సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్లను పనుల్లో పెట్టుకోకూడదన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే లైసెన్సు దారులే బాధ్యత తీసుకోవాలన్నారు. నిర్దేశిత సమయం వరకే విక్రయాలు జరపాలన్నారు. రహస్యంగా తయారు చేయడం, నిల్వ ఉంచడం, విక్రయిస్తే 112 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

సొంతింటి కలలకు వైకాపా గ్రహణం

అయిదేళ్లుగా ఎన్టీఆర్ గృహ బిల్లులు నిలిపివేత

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: గతంలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం కింద చేపట్టిన గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లులను వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిలిపేసింది. నిధులు విడుదల చేయకుండా అయిదేళ్లు లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపించింది. దీంతో జిల్లాలో కొంతమంది బయట అప్పులు చేసి నిర్మించగా, ఎక్కువ మంది గృహాలు బిల్లులు మంజూరుకాక వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇప్పుడు హౌసింగ్ అధికారులు కూటమి ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయి సర్వే జరుపుతున్నారు.

అప్పట్లో 1,16,218 గృహాల మంజూరు..

సొంతస్థలం ఉండి ఇల్లు కట్టుకున్నవారికి 2016 నుంచి 2019 మధ్య ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం కింద అప్పటి తెదేపా ప్రభుత్వం జిల్లాలో మొత్తం 1,16,218 గృహాలు మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు చొప్పున, లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలు యూనిట్ విలువగా నిర్ణయించారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యేనాటికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. 2019 నాటికి 36,734 నిర్మాణాలు పూర్తికాగా బేస్‌మెంట్, పిల్లర్స్, రూఫ్, స్లాబ్ దశలో ఉన్న మరో 79,475 నిర్మాణాలకు అప్పటివరకు అప్‌లోడ్ అయిన బిల్లులకు సంబంధించి రూ.362.67 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత పూర్తయిన, వివిధ దశల్లో ఉన్న మరో 17,797 గృహాలకు బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంతలో ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రావడంతో బిల్లులకు గ్రహణం పట్టింది.

పెండింగ్ బిల్లులు రూ.42.15 కోట్లు..

ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్‌లో నిర్మించిన ఇళ్లకు రూ.42.15 కోట్ల బిల్లులు గత అయిదేళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయాయి. వైకాపా అధికారంలోకి వచ్చే నాటికే పూర్తయిన 4,187, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న మిగతా గృహాలకు కలిపి 17,797 ఇళ్లకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా, మంజూరు చేయకుండా గత ప్రభుత్వం ఆపేసింది. దీనిపై లబ్ధిదారులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు.



పెరవలి మండలంలో సర్వే చేస్తున్న అధికారులు

నియోజకవర్గం	గృహాలు	పెండింగ్ బిల్లు (రూ.కోట్లలో)
అనపర్తి	2,169	4.07
రాజానగరం	3,763	9.56
రాజమహేంద్రవరం గ్రామీణం	2,706	3.41
కొవ్వూరు	2,486	5.79
నిడదవోలు	2,565	5.37
గోపాలపురం	3,115	9.90
గోకవరం (మండలం)	993	4.02

ఇన్నాళ్లకు కదలిక..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించే దిశగా చర్యలు చేపడుతోంది. తాజా పరిస్థితిపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని గృహనిర్మాణ సంస్థ అధికారులకు ఆదేశాలివ్వడంతో జిల్లాలోని ఆయా మండలాల్లో హౌసింగ్ ఏఈ, ఇతర సిబ్బంది పరిశీలిస్తున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఆ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తారు. ఆ తర్వాత మంజూరయ్యే అవకాశం ఉందని జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు.

మిఠాయి దుకాణంపై మూడు కేసులు

నిడదవోలు: పట్టణంలోని యర్నగూడెం రోడ్డులోని శ్రీ కొత్తపల్లి స్వీట్స్ అండ్ హోమ్‌ఫుడ్స్‌లో శుక్రవారం విజిలెన్స్, ఆహార భద్రత, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డ్రైకేక్, రాగి లడ్డూల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. గడువు ముగిసిన కొన్ని ఉత్పత్తులను గుర్తించి కేసు నమోదు చేశారు. స్టాంపులేని నాలుగు తూకపు యంత్రాలను ఉపయోగించడంపై కేసు నమోదైంది. ప్యాకేజీ చేసిన వస్తువులపై నిబంధనలను ప్రకటించక పోవడంతో మరో కేసు నమోదు చేశారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన 6.5 కిలోల ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని రూ.5వేల అపరాధ రుసుం విధించారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వీట్ స్టాల్స్, రెస్టారెంట్ల పరిసరాలు, వంట గదులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు తాతారావు, నాగవెంకటరాజు, వలీ, లోవరాజు, వీరబాబు, రుక్కయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో నేడు తెలుగు జాతీయ సదస్సు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ శనివారం నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగు జాతీయ సదస్సు నిర్వహించనున్నామని కన్వీనర్, తెలుగుశాఖ సహాయాచార్యులు డా.తరపట్ల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. గురువిశ్వస్ఫూర్తి రచనలు - ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నామన్నారు. అతిథులుగా వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తారి శంకర్, యోగివేమన విశ్వవిద్యాలయం సీఈ ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తదితరులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని ఆయన వివరించారు.

జిల్లాకు రెండు పర్యాటక పురస్కారాలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24 సంవత్సరానికిగాను 38 పర్యాటక విభాగాలకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందించింది. అందులో రెండు పురస్కారాలు జిల్లాకు దక్కాయి. రాజమహేంద్రవరంలోని అమ్మ టూరిజం అండ్ ట్రావెల్స్‌కు ఉత్తమ ట్రావెల్ ఏజెంట్(బోటింగ్) అవార్డు లభించగా, జాలీడే టూర్స్‌కు ఉత్తమ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్ అవార్డు దక్కింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ అవార్డులను అందించారు.

ముంచెత్తిన వాన

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రాజమహేంద్రవరంలోని లోతట్టు ప్రాంతాల్లో గంటల తరబడి నీరు నిలిచిపోయింది. పలు ప్రధాన రహదారులపై నుంచి మురుగునీరు ప్రవహించడంతో వాహనచోదకులు, ప్రయాణికులు, పాదచారులు, చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, రంగంపేట, తాళ్లపూడి తదితర మండలాల్లోని కొన్ని రహదారులు జలమయమయ్యాయి. జిల్లాలో సగటు వర్షపాతం 22.9గా నమోదైంది. గడిచిన 24 గంటల్లో (శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు) జిల్లాలో కోరుకొండ మండలంలో అత్యధికంగా 62.0 మిమీ వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలో 43.8 మిమీ, రాజానగరంలో 32.4, సీతానగరం 32.4, నల్లజర్ల 31.2, తాళ్లపూడి 30.4, గోకవరం 29.4, రాజమహేంద్రవరం అర్బన్ 28.4, చాగల్లు 27.4, దేవరపల్లి 24.2, గోపాలపురం 23.4, నిడదవోలు 20.4, కడియం 19.2, కొవ్వూరు 18.8, రంగంపేట 6.6, అనపర్తి 1.4, ఉండ్రాజవరం 0.8మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), ఏ.వి.ఏ.రోడ్డు



రాజమహేంద్రవరంలోని కృష్ణనగర్ రోడ్డులో..



వీరభద్రనగర్ సమీపంలో జలమయమైన రహదారి



ప్రధాన రైల్వేస్టేషన్ రహదారి ఇలా..



షెల్టాన్‌కు వెళ్లే దారిలో పైపులైను పగిలిపోవడంతో కుంగిన రోడ్డు



మాట్లాడుతున్న ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు

మందులకైనా డబ్బులు ఇప్పించండి

జయలక్ష్మి సొసైటీ మహాజన సభలో బాధితుల ఆవేదన

గాంధీనగర్, సర్పవరం జంక్షన్: కనీసం మందులు కొనుక్కునేందుకైనా డబ్బులు ఇప్పించాలని ఒకరు.. కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు పోయాయి. అప్పు చేసి వివాహం చేశాం.. వాటికి వడ్డీ చెల్లించేందుకైనా కొంత సొమ్ము వచ్చేలా చూడాలని మరొకరు.. ఇలా ది జయలక్ష్మి ఎంఎం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభలో సభ్యుల ఆవేదనలు మిన్నంటాయి. సొసైటీ మహాజన సభ శుక్రవారం దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మానాలు ప్రవేశపెట్టిన సమయంలో పలువురు సభ్యులు వాటిని ఆక్షేపిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం సొసైటీ తరఫున ప్రభుత్వం, కోర్టు, రుణగ్రహీతలపై జరిపే లావాదేవీలన్నీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు తీర్మానంలో ఆమోదించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ రూ.500 కోట్లు రుణాలు తీసుకుని చెల్లించని వారి ఆస్తులను సీబీసీఐడీ జప్తు చేసిందన్నారు. కోర్టు నుంచి సేల్ ఆర్డర్ వచ్చిన తర్వాత వాటిని విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. మొత్తం రూ.700 కోట్ల స్కాం జరిగిందన్నారు. సొసైటీకి తనఖా పెట్టిన ఆస్తుల విలువ రూ.497 కోట్ల వరకు ఉంటుందన్నారు. సుమారు రూ.1000 కోట్లు వరకు రానున్న నేపథ్యంలో బాధితులెవ్వరూ అధైర్యం పడవద్దన్నారు. డిసెంబరు నాటికి రూ.50 కోట్లు బాధితులకు అందజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 70 మంది బాధితులు మృతి చెందారన్నారు. ఈ స్కాం విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి వివరించామన్నారు. ప్రభుత్వం నుంచి సొసైటీకి రూ.200 కోట్ల రుణంగా ఇవ్వాలని కోరామన్నారు. తమ పాలకవర్గంపై కొందరు సభ్యులు విష ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు, ఉమ్మడి గోదావరి జిల్లాలు, విశాఖపట్నానికి చెందిన సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

ముందే మేల్కొంటే..

గర్భాశయ క్యాన్సర్ కట్టడి

పీఐఎన్‌సీసీ భారత ప్రతినిధి డా.సమత కడియాల



అవగాహన లేమి కారణంగా కొన్ని వ్యాధులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. తొలి దశలోనే గురిస్తే నివారించవచ్చు. అలాంటివాటిలో సర్వైకల్(గర్భాశయ) క్యాన్సర్ ఒకటి. కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి 26 వరకు మహిళలకు నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. అమెరికాకు చెందిన వైద్యులు సేవలందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 350 మందికి పరీక్షలు నిర్వహించగా ప్రాథమికంగా 44 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పీఐఎన్‌సీసీ(ప్రివెంటింగ్ సర్వైకల్ క్యాన్సర్ గ్లోబల్లీ) భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

హెచ్‌పీవీతో వ్యాప్తి..

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) కారణం. లైంగిక చర్యల ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత సర్వైకల్ క్యాన్సర్‌గా మారుతోంది. అంతవరకు లక్షణాలు కనిపించవు. మూడేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఉనికిని గుర్తించవచ్చు. వెంటనే చికిత్స అందించి పూర్తిగా నయం చేయొచ్చు.

వీఐఏ పరీక్షలతో..

క్యాన్సర్ సంకేతాలను గుర్తించేందుకు విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్(వీఐఏ) పరీక్ష చేస్తారు. వైరస్ ఉంటే థర్మో అబలేటర్ పరికరం ద్వారా చికిత్స అందించి ముప్పు తొలగిస్తారు. వీరు మూడేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి. మొదటి దశలో క్యాన్సర్‌ను నివారించేందుకు వీలుంది. రెండో దశ నుంచి వంద శాతం నివారణ సాధ్యం కాదు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పరీక్షలకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం శిబిరాలు నిర్వహించి సకాలంలో చికిత్స అందించాలి.

నాలుగో వంతు ఇక్కడే..

ప్రపంచంలోని 25 శాతం కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయి. గత మూడు దశాబ్దాల్లో స్వల్ప తగ్గుదల కనిపించినా.. ఏపీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో మార్పు లేదు. మన దేశంలో ఏటా 1,32,000 కేసులు నమోదవుతున్నాయి. 74వేల మంది మృత్యువాత పడుతున్నారు. పీఐఎన్‌సీసీ ద్వారా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

అపార్‌మైన ప్రయోజనాలు

ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను తీసుకురానుంది. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యా శాఖ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన కార్యాచరణ పలు విద్యా సంస్థల్లో ప్రారంభమైంది. డిగ్రీ, పీజీ స్థాయిలో జిల్లాలోని యూనివర్సిటీలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాయి.

\- న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్



తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 13 మంది విద్యార్థులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడి ప్రాంత విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు అందిస్తారు. దీంతో వారు తెలంగాణలో దరఖాస్తు చేసుకోగా ఆంధ్రాలో చదువుతున్నట్లు దస్త్రాలు సమర్పించాలని, రిజిస్ట్రార్ సంతకంతో ధ్రువీకరణ ఉంటేనే ఇస్తామనడంతో ఆ విద్యార్థులు రాజమహేంద్రవరం నుంచి తెలంగాణకు పలుమార్లు తిరగాల్సి వచ్చింది. దీనివల్ల విలువైన సమయం, ధనం, తరగతులు వృథా అయ్యాయి. ఇప్పుడు కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన అపార్‌తో విద్యార్థులకు ఇకపై ఇలాంటి కష్టాలు ఉండవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు జారీచేయడం చేస్తున్నారు. ఇకపై అపార్‌తో రాజమహేంద్రవరం విద్యార్థి రాజస్థాన్‌లోనూ.. కశ్మీర్ విద్యార్థి కోనసీమలోనూ ఇలా దేశంలో ఎక్కడికైనా వెళ్లి చదువుకోవచ్చు.

ఏముంటుంది..?

అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టినతేదీ, జెండర్, ఫొటో, క్యూఆర్‌కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు. విద్యార్థి చదువుకు సంబంధించిన అకాడమీ సమాచారం అంటే ఏ ఏడాది ఎన్ని మార్కులు లేదా ఏ గ్రేడ్ వచ్చింది, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు అందులో ఉంటాయి. విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్‌నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది.

ఎక్కడైనా ప్రవేశాలు..

కేంద్ర ప్రభుత్వం జారీచేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా వచ్చే కార్డులో సంబంధిత విద్యార్థి బ్యాంకు ఖాతా, డిజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీచేసే ముందు కేంద్ర ప్రభుత్వం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)ని ప్రారంభించింది. డిజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్ కార్డు వస్తుంది. దీనిని విద్యార్థి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర పనులన్నీ సులువుగా పూర్తవుతాయి. ఇకపై ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో ఇదే కీలకం కానుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు.

త్వరలోనే ప్రారంభిస్తాం..

ప్రతి విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం అపార్ పేరిట గుర్తింపు నంబరును ఇచ్చేందుకు కార్యాచరణ ప్రారంభించింది. త్వరలోనే విద్యార్థులందరికీ కార్డులు అందిస్తాం. ఈ విధానంపై ముందుగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

\- కె.వాసుదేవరావు, డీఎస్ఈఓ

జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ



రాంబాబు పుల్లంరాజు

వి.ఎల్.పురం: రాజమహేంద్రవరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1గా ఆర్.రాంబాబు, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా కె.పుల్లంరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన రాంబాబు, ఏలూరు జిల్లా ఓట్లూరులో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పుల్లంరాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1గా పనిచేసిన ఎం.రాజబాబు నిడదవోలుకు బదిలీకాగా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా పనిచేసిన కమలప్రియ అనపర్తికి బదిలీపై వెళ్లారు.

220 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యాన్ని జిల్లావ్యాప్తంగా 220 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. వచ్చే నెల నుంచి చేపట్టే ఖరీఫ్ ధాన్యం సేకరణపై శుక్రవారం రాజమహేంద్రవరంలో క్షేత్రస్థాయి అధికారులు, సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సేకరించనున్నట్లు చెప్పారు. ధాన్యం సేకరణలో హేతుబద్ధత పాటించాలన్నారు. వ్యవసాయ, సాంకేతిక సహాయకులు క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన బాధ్యతలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రైతు సేవాకేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఒక టెక్నికల్ సహాయకుడు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ చొప్పున నియమించినట్లు తెలిపారు. ప్రతి వాహనానికి జియోట్యాగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి పరిశీలించాలన్నారు.



విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్న జేసీ చిన్నరాముడు

ఈసారి అధిక మద్దతు ధర

గతేడాది కంటే ఈసారి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.117 అధిక మద్దతు ధర ప్రకటించినట్లు జేసీ తెలిపారు. కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. తేమ శాతం 17కు మించకుండా చూసుకోవాలన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక మాట్లాడుతూ వచ్చేనెల చివరి వారం నుంచి ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఇన్‌ఛార్జి డీఎస్‌వో నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై పరిశోధనలకు కార్యాచరణ

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పొగాకుతో పాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం వంటి వాణిజ్య పంటలపై విస్తృ పరిశోధనలు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ(ఎన్ఐఆర్‌సీఏ)- రాష్ట్ర రైతు సాధికార సంస్థ- ప్రకృతి వ్యవసాయ విభాగం(ఏపీసీఎన్ఎఫ్) అవగాహన ఒప్పందం స్థానిక సీటీఆర్ఐలో జరిగింది. సీటీఆర్ఐ డైరెక్టర్ మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ అనుసంధానంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఎన్ఐఆర్‌సీఏ సహకారంతో మార్కెటింగ్ చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొగాకుతోపాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై సంయుక్త పరిశోధనలు చేసేందుకు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎన్ఐఆర్‌సీఏ -ఏపీసీఎన్ఎఫ్ తరఫున నాణ్యమైన ఉత్పత్తుల లభ్యతతోపాటు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ వలి, భువిజ ఎన్జీవో సంస్థ అధికారి నరసింహారావు, కలవచర్ల కేవీకే హెడ్ వి.ఎస్.జి.ఆర్.నాయుడు, సీటీఆర్ఐ విభాగాధిపతులు, ఐటీఎంయూ నోడల్ అధికారి రవిశంకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ తదితరులు

ఉద్యోగ మేళాలో 65 మంది ఎంపిక

హుకుంపేట: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బొమ్మూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 7 కంపెనీలు రాగా 137 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. అందులో 65 మందిని కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారని జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్ పేర్కొన్నారు. జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్, కన్వీనర్ ఎల్ఆర్ఆర్ కృష్ణ, ప్రిన్సిపల్ రాధాకృష్ణ, పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన వైకాపా కౌన్సిలర్లు

నిడదవోలు: నిడదవోలు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని వైకాపా కౌన్సిలర్లు బహిష్కరించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడేందుకు సిద్ధమవుతుండగా అదే పార్టీకి చెందిన వైకాపా కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ లేచి మాట్లాడుతూ ప్రస్తుత అజెండాలో ఉన్న అంశాలు ఏ ఒక్క కౌన్సిలర్‌కు చెప్పకుండా ఛైర్మన్ ఏకపక్షంగా తీసుకువచ్చారని.. దీనికి నిరసనగా తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆయనకు మద్దతుగా 25 మంది వైకాపా కౌన్సిలర్లతోపాటు కోఆప్షన్ సభ్యులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. షేక్ వజీరుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఛైర్మన్ ఆదినారాయణ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాలు సైతం కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వైకాపాకు చెందిన వైస్‌ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, మద్దిపాటి నాగశ్రీ మాత్రం సమావేశంలో ఉన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కౌన్సిల్ సమావేశం వేదికని, వైకాపా కౌన్సిలర్లు బయటకు వెళ్లడం సరైన విధానం కాదని తెదేపా కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు అన్నారు. దీనిపై రూల్ పొజిషన్ చెప్పాలని ఛైర్మన్, కమిషనర్ కృష్ణవేణిని కోరారు. ఆమె చెప్పే ప్రయత్నం చేయగా, వైకాపా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. అజెండా ఆమోదం పొందాలంటే మెజార్టీ కౌన్సిలర్లు మద్దతు ప్రకటించాల్సి ఉంటుందని చెప్పి వారంతా బయటకు వెళ్లిపోయారు.



సమావేశం బహిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న వైకాపా కౌన్సిలర్లు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

రాయవరం: రాయవరంలో 85 సంవత్సరాల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో న్యాయస్థానం, క్రైమ్ అగైనెస్ట్ విమెన్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 5 గంటల ప్రాంతంలో 85 ఏళ్ల వృద్ధురాలిపై లారీ క్లీనర్‌గా పని చేస్తున్న కరప మండలం వేళంగికి చెందిన నొక్కు వెంకటరమణ అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. వృద్ధురాలి అరుపులకు సమీప ఇంటి యజమాని, అతని భార్య అక్కడకు చేరుకొని నిందితుడిని పట్టుకొని రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి ఎస్సై పీవీఎస్ఎస్ఎన్ సురేష్ కేసు నమోదు చేయగా, సీఐ గౌరీశంకర్ దర్యాప్తు చేశారన్నారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు పది సంవత్సరాలు కఠిన కారాగారం, ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.అయిదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బి.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారన్నారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్సైలు పీవీఎస్ఎస్ఎన్ సురేష్, బుజ్జిబాబు, అప్పటి సీఐలు గౌరీశంకర్, పి.శివగణేష్, ఏఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించినట్లు సీఐ తెలిపారు.

రాజమహేంద్రవరం

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, స్వామి, అప్సర, రంభ: **దేవర.** సూర్యమినీ, ఊర్వశి: **సత్యం సుందరం.** మేనక: **మత్తు వదలరా.**

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు రేపు

శ్యామలా సెంటర్: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా 29న ఉపాధ్యాయులకు ఆర్ట్స్ కళాశాలలో పలు క్రీడలను నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు పి.జయకర్ పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందెం, వాకింగ్, షాట్‌పుట్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

రేపు ఉచిత మెగా గుండె వైద్యశిబిరం

వి.ఎల్.పురం: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా 29న తిలక్‌రోడ్డులోని పల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె వైద్యశిబిరాన్ని, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వైద్య నిపుణులు వంశీకృష్ణ, లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఆసుపత్రి వద్ద జరిగే శిబిరంలో గుండె సంబంధ సమస్యలపై ఉచిత పరీక్షలు చేస్తామన్నారు. ఉదయం 7 నుంచి 8 వరకు రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ సహకారంతో ఆసుపత్రి నుంచి ఐఎంఏ హాల్ వరకు వాక్‌ఫర్ హార్ట్ పేరిట నడక కార్యక్రమం ఉంటుందన్నారు.

వరద బాధితులకు సాయం


మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న ప్రతినిధులు

టి.నగర్: వరద బాధితులకు ఏపీ నూర్ భాషా సంక్షేమ సంఘం నాయకులు రూ. 2,60,200 అందించారు. మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం చెక్కును అందించారు. ఏపీ టీడీపీ నూర్ భాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేపీఆర్ మహమ్మద్, డాక్టర్ బాబాన్, ఆదాం షఫీ, నాగూర్ మీరావలి, ఇబ్రహీం, షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

'అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు'

టి.నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల సమస్యలు సృష్టించి మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. ఇటీవల తమ ప్రభుత్వం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వంద రోజుల్లో పింఛన్లు పెంచామని, అన్న క్యాంటీన్లు ప్రారంభించామని, చెత్తపై పన్ను రద్దు చేశామన్నారు. నగరంలో ఇళ్ల పట్టాల పంపిణీ, ఆవ భూమి కొనుగోళ్లు, అవినీతిపై విచారణ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో 100 రోజుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.16 లక్షలు అందించామన్నారు. అత్తి సత్యనారాయణ, చల్లా శంకర్రావు, బొమ్మన జయకుమార్, యెనుముల రంగబాబు, బూరా రామచంద్రరావు, తవ్వా రాజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఛాంబర్ ఉపాధ్యక్ష స్థానాలు ఏకగ్రీవం

వి.ఎల్.పురం: ది రాజమహేంద్రవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యక్ష స్థానాలు కూడా ఏకగ్రీవమయ్యాయి. నామపత్రాల ఉపసంహరణ గడువు ముగిసేరోజుకు ఉపాధ్యక్ష పదవులకు మినహా మిగతా అన్ని స్థానాలు ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే. రెండు ఉపాధ్యక్ష స్థానాలకు ముగ్గురు పోటీ పడుతుండగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసే సమయానికి ఒకరు ఉపసంహరించుకున్నారు. వంటెద్దు సూరిబాబు, యియ్యపు మురళీధర్, దేశిరెడ్డి బలరామ్‌నాయుడు పోటీలో నిలిచారు. 30న ఎన్నిక జరగాల్సి ఉంది. బలరామ్ నాయుడు ఛాంబర్ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ఉపసంహరించుకోవడంతో ఏకగ్రీవం అయ్యాయని ఛాంబర్ ప్రధాన ఎన్నికల అధికారి జవ్వార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఛాంబర్ కొత్త పాలకవర్గానికి సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్ష, గౌరవ కార్యదర్శి, గౌరవ సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, డైరెక్టర్లు కలిపి మొత్తం 24 స్థానాలు ఏకగ్రీవమయ్యాయన్నారు. 29న ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ బాడీ సమావేశం జరగనుంది.


ఉపసంహరణపత్రం అందజేస్తున్న బలరామనాయుడు

పొద్దంతా వాన


శ్యామల సెంటరులో..


టి.నగర్ రోడ్డులో..


ఆల్కాట్ తోటలో..


పుష్కర ఘాట్ రైలు వంతెన కింద..


రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలో.

దేవీచౌక్, ఏ.వి.ఎ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో శుక్రవారం కురిసిన వర్షం రహదారులను ముంచెత్తింది. కృష్ణానగర్ రోడ్డు, రామచంద్రరావు పేట, ఆల్కట్ తోట, ఆదాయ పన్ను శాఖ కార్యాలయం రోడ్డు, మోరంపూడి రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, ప్రధాన రైల్వేస్టేషన్ రోడ్డు, ఫ్రీడం పార్కు, శ్యామ సెంటర్, తుమ్మలావలో కొన్ని వీధులు మునిగిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే దేవీచౌక్-గోకవరం బస్టాండ్ రోడ్డులో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారిపై రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పేపర్ మిల్లు రోడ్డు ప్రాంతంలో ఓ చెట్టు కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.


రామచంద్రరావు పేటలో..


ఆదాయ పన్ను శాఖ కార్యాలయం సమీపంలో..

కుంగిపోతున్నా.. మరమ్మతులేనా?

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గోరక్షణ పేట రోడ్డు నుంచి శీలం నూకరాజు కాంప్లెక్స్ రోడ్డు మీదుగా షెల్టాన్‌కు వెళ్లే దారిలో పాత పైపులైన్ పగిలి, రోడ్డు కుండిపోయి, ప్రమాదకరంగా మారింది. పాత సిమెంటు పైపులైను, ప్రమాదమని తెలిసీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇదే రాత్రి సమయంలో జరిగి ఉంటే వాహనాలు అదుపు తప్పి అందులో పడితే ప్రాణాలు పోయే అవకాశం ఉంది.

ఆర్యాపురం నుంచి ధవళేశ్వరం వరకు..

గత పుష్కరాలకు ప్రత్యేక నిధులతో ముంపు నివారణలో భాగంగా ఆవ ఛానల్‌లో కలిసే విధంగా భూగర్భ పైపులైన్ నిర్మించారు. నల్లాఛానల్ నుంచి మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవడం ద్వారా కాలుష్యం పెరుగుతోంది. ఈ తరుణంలో ఒత్తిడి తగ్గించేందుకు నీటిని మళ్లించేలా ప్రతిపాదనలు చేశారు. ఆవ ప్రాంతంలో 30 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంటు ఉండడంతో మురుగునీటిని శుద్ధి చేస్తుంది. దీంతో ఆర్యాపురం స్టోరేజి ట్యాంకు నుంచి భూగర్భ పైపులైన్ ద్వారా గోకవరం బస్టాండ్, ఆజాద్‌చౌక్, గోరక్షణపేట, శీలం నూగరాజు కల్యాణ మండపం, షెల్టాన్ హోటల్ మీదుగా పైపులైన్ ఎస్‌టీపీ ప్లాంట్‌కు చేరుతుంది. అక్కడ నీరు శుద్ధి చేసిన తర్వాత తిరిగి ఆవ ఛానల్ ద్వారా ధవళేశ్వరం సాయిబాబా గుడి పక్కన కాలువల మీదుగా గోదావరిలో కలుస్తుంది.

శిథిలమైన పైపులైను..

పైపులైన్ వేసి సుమారు పదేళ్లు అవ్వడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువ. దీన్ని ఆనుకొని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా బస్సులన్నీ వెళ్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో అప్పుడప్పుడు ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీనికి తోడు సిమెంటు పైపులైన్‌లో మురుగునీటితో పూడిక పెరిగి, గ్యాస్ ఉత్పత్తి అయ్యి, ఆ ఒత్తిడితో పగిలిపోయి ఉండొచ్చని ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు వేస్తున్నారు.


గత డిసెంబర్‌లో గోరక్షణ పేటలో కుంగిన రోడ్డు

శాశ్వత పరిష్కారమేది..

నగర సుందరీకరణ పేరుతో రూ. లక్షలు ఖర్చు చేస్తున్న నగరపాలక సంస్థ పైపులైన్ విషయంలో నిర్లక్ష్యంగా ఉంది. గతేడాదిలో రెండుసార్లు ఇలాంటి పరిస్థితే ఎదురైనా అప్పటి వైకాపా ప్రభుత్వం కళ్లు తెరవలేదు. ప్రస్తుతం సిమెంటు రోడ్డు స్థానంలో ఇనుప లైన్ వేస్తున్నారు. ఆర్యాపురం నుంచి ఆవ ఛానల్ వరకు సుమారు రూ.4 కోట్ల మేర ఇనుప లైన్ వేయాలంటే రూ.10 కోట్లు అవుతుందని గతంలోనే అంచనా వేశారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు తిరిగే గోరక్షణ పేట నుంచి షెల్టాన్ వరకు లైన్ వేస్తే రూ.90 లక్షలు అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసినా పట్టాలు ఎక్కలేదు. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పైపులు పగిలినప్పుడు మరమ్మతుల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా, శాశ్వత పరిష్కారం చూపట్లేదు.

ప్రతిపాదనలు చేశాం..

పాత పైపులైన్ కావడం, ఆర్టీసీ బస్సులు ఎక్కువగా తిరగడం వల్ల ఒత్తిడికి సిమెంటు పైపు పగిలిపోయింది. పైగా భూగర్భ పైపుల్లో పూడికతో గ్యాస్ ఉత్పత్తి జరిగి, రసాయనిక ప్రక్రియతో ఇలా అయ్యింది. ప్రస్తుతం పాత పైపులైను స్థానంలో ఇనుప లైన్ వేయాల్సి ఉంది. వాహనాలు రద్దీ ఎక్కువగా ఉన్న చోట 500 మీటర్ల వరకు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– పాండురంగారావు, మున్సిపల్ ఎస్ఈ

రాజ్యాంగంపై గౌరవభావం ఉండాలి

దానవాయిపేట(రాజమహేంద్రవరం): రాజ్యాంగ విలువలపై గౌరవ భావం కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కందుకూరి రాజ్యాలక్ష్మి మహిళ కళాశాలలో మహిళ చట్టాలు, రాజ్యాంగంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక హక్కులను కాపాడుకోవడంతో పాటు బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమయం చాలా విలువైనదని, సమయపాలన కలిగి ఉండాలన్నారు. మహిళా చట్టాలు వివరించారు. విశ్రాంత జడ్జి శ్రీనివాస్, ప్యానల్ న్యాయవాది దేవి భావాని, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జైల్లో శశికృష్ణ ప్రవర్తనపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: గుంటూరులో బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకేసులో మరణశిక్ష పడి, ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న కుంచాల శశికృష్ణ వ్యవహార శైలి, మానసిక స్థితి, అతని కుటుంబనేపథ్యం వివరాలు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను అక్టోబరు 22కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ప్రేమను తిరస్కరించిందన్న కారణంతో 2021 ఆగస్టులో రమ్యను గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు చెందిన శశికృష్ణ కత్తితో పొడిచి హత్య చేశాడు. 2022 ఏప్రిల్ 29న విచారణ కోర్టు.. శశికృష్ణకు మరణశిక్ష విధించింది. నిందితుడు దాఖలు చేసిన అప్పీల్‌తో పాటు మరణశిక్షను ఖరారు చేసేందుకు నమోదు చేసిన వ్యాజ్యంపై ఇటీవల హైకోర్టు విచారణ జరిపింది. శశికృష్ణ తరపు న్యాయవాది చల్లా అజయ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. శిక్ష తీవ్రతను తగ్గించేందుకు వీలున్న అంశాలను విచారణ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, హైకోర్టు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆ మేరకు హైకోర్టు ఆదేశించింది.

ప్రదర్శనశాలకు కందుకూరి పుస్తకాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుకు సంబంధించిన అరుదైన 60కి పైగా పుస్తకాలను పురావస్తుశాఖ ప్రదర్శన నిమిత్తం బహూకరించానని కందుకూరి జీవిత చరిత్ర పరిశోధకుడు పి.వి.బి.సంజీవరావు తెలిపారు. పరిశోధన సమయంలో సేకరించిన కందుకూరి సాహిత్యాన్ని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలనే తపనతో పురావస్తుశాఖ సహాయ సంచాలకులు కె.తిమ్మరాజుకు అందజేశామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉద్యోగాలను అప్‌డేట్ చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆర్జేడీ ఎంతట ఉద్యోగులు ఇవ్వాలంటూ యూటీఎఫ్ సంఘ సభ్యులు శుక్రవారం డీఈఓ కె.వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ పాఠశాలల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని కోరారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి అక్టోబరు 2న మున్సిపాలిటీల్లో సత్యాగ్రహ దీక్ష చేపడతామన్నారు.

'మాజీ ఎంపీని విమర్శించే స్థాయి లేదు'

దేవీచౌక్, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ భరత్‌ను విమర్శించే స్థాయి ఐన్నవారికి దీపుకు లేదని వైకాపా నాయకులు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నాయకులు కానుబోయిన సాగర్, మార్తి నాగేశ్వరరావు, బిల్డర్ చిన్న మాట్లాడారు. భరత్‌రామ్ ఉన్నత పదవి ఇప్పిస్తే అన్ని మర్చిపోయి మాట్లాడటం తగదని హితవు పలికారు. తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేరవార్తలు: కాతేరు గణపతినగరం ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్బాస్(31) గామన్ వంతెన సమీపంలోని టైల్స్ దుకాణంలో పని చేస్తుంటారు. ఈనెల 25న పనిలోకి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. శుక్రవారం అతడి భార్య సయ్యద్ నిర్మల మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో ఢీకొని గాయాలు..

ధవళేశ్వరం ప్రాంతానికి చెందిన ఎన్.రాజేంద్రప్రసాద్ శుక్రవారం ద్విచక్రవాహనంపై ఆల్కట్‌తోట గోదావరి గట్టుపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. అతనికి గాయాలవ్వడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్టు

శాటిలైట్ సిటీ ప్రాంతానికి చెందిన ఆర్.మునేశ్వరరావు స్థానికంగా అక్రమ మద్యం విక్రయిస్తున్నారు. బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

జిల్లా అభివృద్ధికి అడుగులు

రాజానగరం, న్యూస్‌టుడే: పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసిన రాజమహేంద్రవరంలో రివర్, టెంపుల్ టూరిజం అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయని పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం 2024 సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు గోదావరి మధ్య ఉన్న పిచ్చుకలంక, ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పలుసంస్థలు ఆశక్తి కనబరుస్తున్నాయన్నారు. విజేతలను విశ్వవిద్యాలయ ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.ఉదయ్ భాస్కర్ ప్రకటించారు.



విజేతల వివరాలు..

వ్యాసరచనలో కె.శ్రావ్య, (ఏకెఎన్‌యు), ఎం.కీర్తిక (గైట్ కళాశాల), మొదటి, రెండు బహుమతులు గెలుచుకున్నారు. ఫొటోగ్రఫీలో నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.సాయిచందు, జె.సురేష్‌చంద్ర, సి.హెచ్.ఎస్తేరురాణి వరుసగా మొదటి మూడు స్థానాలు గెలుచుకున్నారు. వీడియోగ్రఫీలో వి.చరణ్‌వెంకటపవన్ (ఏకెఎన్‌యు), బి.సౌమ్యదీపిక (ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), బహుమతులు గెలుచుకున్నారు.


సాంస్కృతిక ప్రదర్శన


విజేతలకు జ్ఞాపికలు ఇస్తున్న కలెక్టర్, తదితరులు

స్వర్ణాంధ్ర జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

శ్యామలా సెంటర్: స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై రాజమహేంద్రవరం మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగాయి. ఈ పోటీల్లో మండలస్థాయి నుంచి ముగ్గురు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు డీఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. వ్యాసరచనలో ఎస్‌కేవీటీ పదోతరగతి విద్యార్థిని సుష్మసాయి, వక్తృత్వంలో ప్రతిభా పాఠశాల పదోతరగతి విద్యార్థిని కె.వెన్సెంట్, డిబేట్‌లో ప్రతిభా పాఠశాల 9వ తరగతి విద్యార్థులు జె.ఉజ్వల్, డి.యశ్వంత్‌లు విజేతలుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

వి.ఎల్.పురం: ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జీఎస్ఎల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు సూచించారు. శుక్రవారం స్థానిక కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ వద్ద విశాలాంధ్ర బుక్ హౌస్ బస్సును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతర పుస్తక పఠనంతో అనేక విషయాలు తెలుస్తాయన్నారు. ప్రపంచ మేధావుల పుస్తకాలు అధ్యయనం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, సహాయ కార్యదర్శి రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

29న ఆర్యాపురం బ్యాంకు మహజన సభ

దేవీచౌక్: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 29న ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు జనరల్ బాడీ(సాధారణ మహాజన సభ) నిర్వహించనున్నట్లు బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు వెల్లడించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బ్యాంకు ఎ-తరగతి సభ్యులు ఆధార్, బ్యాంకు గుర్తింపు కార్డుతో సభకు హాజరు కావాలన్నారు. తమ ప్యానెల్ బాధ్యతలు చేపట్టిన 65 రోజుల్లో రుణాలు రూ.30 కోట్లు మంజూరు చేశామన్నారు. జులై 23 నాటికి 59.41 శాతం ఉన్న సీడీ రేషియో 63.13 శాతానికి పెరిగిందన్నారు. నెట్ ఎన్‌పీఏ 12.84 శాతం నుంచి 3.83 శాతానికి తగ్గిందన్నారు. 2,745 ఉన్న ఎన్‌పీఏ ఖాతాలను 1,224కు తగ్గించామన్నారు. వైస్ ఛైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు యెనుముల రంగబాబు, యర్రమోతు ధర్మారావు, పడాల శ్రీనివాస్, యాళ్ల వెంకట్రావు, బుడ్డిగ రవి, పిల్లి శ్యామ్‌కుమార్, పెదకాపు, నీలపాల సత్యనారాయణ, కె.సూర్యప్రకాశరావు, సింగంపల్లి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ శంకరరావు

మంచితనం.. క్రమశిక్షణతో మార్పు సాధ్యం


మాట్లాడుతున్న స్వామి సేవానందజీ మహారాజ్

దానవాయిపేట (రాజమహేంద్రవరం): జీవితంలో మార్పు రావాలంటే సహకారం, మంచితనం, క్రమశిక్షణ, సమయపాలన వంటి లక్షణాలతో సాధ్యమని రాజమహేంద్రవరం వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ స్వామి సేవానందజీ మహారాజ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద చికాగోలో ఉపన్యాస దినోత్సవ సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఖైదీలకు మానసిక పరివర్తన, ప్రేరణపై ఉపన్యసించారు. సంకల్ప బలముంటే ఏ వయసు వారైనా మారొచ్చన్నారు. దోపిడీ దొంగైన వాల్మీకి మహర్షిలా మారారని గుర్తుచేశారు. మతమేదైన దైవచింతన కలిగి ఉండాలన్నారు. కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలోను అనంతమైన విజ్ఞానం, శక్తి దాగి ఉన్నాయన్నారు. మహనీయుల రచనలు చదవడం, బోధనలు వినడం చేయాలన్నారు. కారాగారం జైలర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఒత్తిడి దూరం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నైతిక విలువలు పాటిస్తూ ముందుకు సాగితే విజయం వెన్నంటే ఉంటుందని స్వామి శశికాంతానందజీ మహరాజ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద చికాగో నగర ఉపన్యాసాల కార్యక్రమం (1893 సెప్టెంబరు 11నుంచి 27వరకు) వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠంలో విద్యార్థులకు యువజన సదస్సు నిర్వహించారు. స్వామి శశికాంతానందజీ, స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ప్రసంగిస్తూ ఉత్తమ లక్షణాలను అలవరచుకుని దేశానికి సేవలందించాలన్నారు. ఆధ్యాత్మికతను ఆశ్రయిస్తే సమస్యలు తొలగిపోతాయన్నారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు ధ్రువపత్రాలు, స్వామి వివేకానంద సాహిత్యం పంపిణీ చేశారు. అమిరపు నటరాజన్, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల దంపతులు

కోరుకొండ: తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేయడంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. గాదరాడలోని తన నివాసంలో సతీమణి వెంకటలక్ష్మితో కలిసి దీపం మహాలక్ష్మి పూజ చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, స్వామి, అప్సర, రంభ: **దేవర,** సూర్యమినీ, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2.



మాట్లాడుతున్న ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ శంకరరావు

29న ఆర్యాపురం బ్యాంకు మహాజన సభ

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 29న మధ్యాహ్నం 3 గంటలకు ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు జనరల్ బాడీ(సాధారణ మహాజన సభ) నిర్వహించనున్నట్లు బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు వెల్లడించారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బ్యాంకు ఎ-తరగతి సభ్యులు ఆధార్, బ్యాంకు గుర్తింపు కార్డుతో సభకు హాజరు కావాలన్నారు. తమ ప్యానెల్ బాధ్యతలు చేపట్టిన ఈ 65 రోజుల్లో బ్యాంకులో రుణాలు రూ. 30 కోట్లు మంజూరు చేశామన్నారు. జులై 23 నాటికి 59.41 శాతం ఉన్న సీడీ రేషియో 63.13 శాతానికి పెరిగిందన్నారు. నెట్ ఎన్‌పీఏ 12.84 శాతం నుంచి 3.83 శాతానికి తగ్గిందన్నారు. బ్యాంకు వైస్ ఛైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు యెనుముల రంగబాబు, యర్రమోతు ధర్మారావు, పడాల శ్రీనివాస్, యాళ్ల వెంకట్రావు, బుడ్డిగ రవి, పిల్లి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తొర్రేడు విద్యార్థులు

సీతానగరం: రాజమహేంద్రవరం గ్రామీణంలోని తొర్రేడు మన్యం సూరయ్య జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సాయిబాబా వివరాలిలా ఉన్నాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆర్చరీ ఇండియన్ విభాగంలో ప్రతిభ చూపిన అండర్-14 టి.గీతిక, అండర్-17 కె.అమూల్య, పి.యశ్వంత్, కె.ఉపేంద్ర ఎంపికయ్యారు. రికర్వ్ విభాగంలో కె.జాన్సన్, జి.రాహుల్, సీహెచ్.నవీన్, జి.ప్రవీణ్‌కుమార్, కె.చైతన్య, విజయలక్ష్మి ఎంపికయ్యారు. స్విమ్మింగ్‌లో బి.రవికిరణ్ ఉన్నారు. వీరంతా పార్వతీపురంలో నిర్వహించే ఈ పోటీలకు హాజరవుతారని వ్యాయామ ఉపాధ్యాయిని ఎం.కుమారి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాలు వెలగలేదు

సమస్య: పాతబొమ్మూరు ప్రాథమిక పాఠశాల సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు ఆ దారిన రాకపోకలు సాగించలేకపోతున్నాం.

- కిరణ్, స్థానికుడు

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయించి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి

– న్యూస్‌టుడే, బొమ్మూరు

పగలే వెలుగులు

సమస్య: బలభద్రపురంలో కొన్ని వీధుల్లో పగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి.


- గ్రామస్థుడు, బలభద్రపురం

సమాధానం: ఉదయం దీపాలు వెలగకుండా నిలుపుదల చేసినా కావాలని ఎవరో దుండగులు యంసీబీ స్విచ్ ఆన్ చేస్తున్నారు. దీనిపై నిఘా ఏర్పాటు చేశాం.

-లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, బిక్కవోలు

బెర్మ్‌లు మరిచారు..



సమస్య: దివాన్‌చెరువు - శ్రీరాంపురం మధ్య ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా బెర్మ్‌లు ఏర్పాటు చేయలేదు. పెద్ద వాహనాలు ఎదురు వచ్చినప్పుడు ద్విచక్రవాహనదారులు రహదారి కిందకు దిగాల్సి వస్తోంది. ఆ సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

- కె.రామచంద్రరావు, శ్రీరాంపురం

సమాధానం: ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ – న్యూస్‌టుడే, రాజానగరం


మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

ఉల్లి అధరహో..

• ధరాభారం తప్పడం లేదంటూ ఆవేదన

నిన్న, మొన్నటి వరకూ నూనె ధరలు చూసి నోరెళ్లబెట్టిన వినియోగదారులకు నేడు పెరిగిన ఉల్లి ధరలు భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే కాయగూరల ధరలు ఆకాశాన్నంటాయని వీటికి తోడు నిత్యావసరంగా ఉన్న ఉల్లి ధరలు అమాంతంగా పెరగడంతో చేతిచమురు వదులుతోందని పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, కడియం



ఇష్టానుసార అమ్మకాలు

నియోజకవర్గ పరిధిలో బయట మార్కెట్లలోని దుకాణాలపై మార్కెట్ కమిటీ అధికారులు పర్యవేక్షణ లోపించడంతో ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కడియం, ధవళేశ్వరం వంటి గ్రామాల్లో రైతుబజార్లు లేకపోవడంతో దుకాణదారులు చెప్పిందే వేదంలా మారింది. ఎవరి దగ్గర ధరలు పట్టిక సైతం కనిపించదు. సుమారు అయిదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో గల రాజమహేంద్రవరంలోని రైతుబజార్లలో ఖరీదు చేసుకుని వస్తున్నామని వాపోతున్నారు. అక్కడ కేజీ రూ.50కు విక్రయిస్తున్న ఉల్లి ఇక్కడి మార్కెట్లలో కేజీ రూ.100గా అడ్డగోలుగా విక్రయాలు సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గత్యంతరం లేక అవే కొంటున్నామని అంటున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు వీరి ఆగడాలపై అడ్డుకట్ట వేయకపోవడంతో ఈ ధరలు సామాన్యుల నడ్డివిరుస్తున్నాయన్నారు.

పూర్తికాని నిర్మాణ పనులు

కడియం, ధవళేశ్వరంలో తలపెట్టిన రైతుబజార్ల నిర్మాణ పనులు పూర్తికాలేదు. ఇది అక్కరకు వస్తే కాయగూరల ధరలు తగ్గే అవకాశం ఉంది. కమిషన్ దుకాణాలు అధికమై హెచ్చు ధరలతో ప్రజలకు ధరాభారం తప్పడం లేదంటున్నారు.

నియంత్రించాలి



ఉల్లి, కాయగూరలు ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. పెరిగిన ధరలతో సామాన్యుల ఇంటి బడ్జెట్ తారాస్థాయికి చేరుతోంది. ఆకాశాన్నంటిన ధరలను అదుపుచేసి ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

- బడిగంటి వీర సూర్యకుమారి, గృహిణి, కడియం

జిల్లా అభివృద్ధికి వేగంగా అడుగులు



సాంస్కృతిక ప్రదర్శన దృశ్యాలు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో రివర్, టెంపుల్ టూరిజం అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయని పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం 2024 సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంతో పాటు గోదావరి మధ్య ఉన్న పిచ్చుకలంక, ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పలుసంస్థలు ఆశక్తి కనబరుస్తున్నాయన్నారు. కొవ్వూరు గోదావరి తీరంలో పర్యాటక వసతుల నిర్మాణానికి మైస్ (MICE) ప్రాజెక్టును పీపీపీ పద్ధతిలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. ఈ తరుణ నన్నయ విశ్వవిద్యాలయ ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.టేకి భాస్కర్ ప్రకటించారు.



విజేతలకు జ్ఞాపికలు ఇస్తున్న కలెక్టర్, తదితరులు

విజేతల వివరాలు.. వ్యాసరచనలో కె.త్రివ్య, (ఏకెఎస్‌వీయు), ఎం.శ్రీలక్ (గైట్ కళాశాల), పి.పూర్ణసింధు (జీ.బి.ఆర్. డిగ్రీ కళాశాల, అనపర్తి) వరుసగా మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. ఫోటోగ్రఫీ విభాగంలో నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.సాయివంద, జె.సురేష్‌చంద్ర, సి.హెచ్.ఎన్వేరరాణి వరుసగా మొదటి మూడు స్థానాలు గెలుచుకున్నారు. వీడియోగ్రఫీలో వి.చరణ్‌వెంకటపవన్ (ఏకెఎస్‌వీయు), బి.సౌమ్యదీప్ (ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), కె.శివశంకర్ (వి.ఎస్.ఎం.అటానమస్ కళాశాల, రామచంద్రాపురం) మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు.

అమ్మవారి ఉత్సవాలకు రాటమంచి



కొంకుదురులో రాట మంచి చేస్తున్న భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొంకుదురు, పందలపాకలో దసరా ఉత్సవాల నిర్వహణకు శుక్రవారం రాటమంచి చేశారు. కొంకుదురు మూలాటపు వద్ద అడపా పెద్ద లక్ష్మి భవాని దంపతులు, పందలపాకలో సంతోషిమాత ఆలయం వద్ద ధర్మకర్త పడాల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రాట మంచి వేశారు. ఉప సర్పంచి పడాల వెంకట రామా రెడ్డి, తోస్సిపూడి సర్పంచి కొవ్వూరి సీతారత్నం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు రేపు

శ్యామలాసెంటర్: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 29న ఉదయం 9గంటలకు ఉపాధ్యాయులకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో పలు క్రీడలను నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు పి.జయకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందెం, వాకింగ్, షాట్‌పుట్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

స్వర్ణాంధ్ర-2047 పోటీల్లో ప్రతిభ



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలతో ఉపాధ్యాయులు

కడియం, కోరుకొండ, న్యూస్‌టుడే: కడియం మండలంలో స్వర్ణాంధ్ర-2047 వ్యాసరచన, వక్తృత్వ పోటీలు తొమ్మిది జడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో జరిగాయి. మండల విద్యాశాఖ అధికారులు మణి కుమార్, నాగేశ్వరరావు ఈ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. 20 మంది పాల్గొన్న ఈ పోటీల్లో వక్తృత్వ విభాగంలో వి.లావణ్య(కడియం), సీహెచ్ మణికంఠ(వీరవరం), వర్షిత(మురమండ), వ్యాసరచనలో ఎన్.రమ్యశ్రీ(కడియం), కృష్ణచైతన్య (దుళ్ల), యశ్వంత్(వీరవరం) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను కైవసం చేసుకున్నారు. గొల్లపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించగా న్యాయనిర్ణేతలుగా ఎస్.శ్రీనివాస్, పాల్ శంకరం, ప్రభాకర్ రాజులు వ్యవహరించారు.

● కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వర్ణాంధ్ర- 2047 పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో ఎం.దివ్య, ఎస్.వీణశ్రీ, బి.లలిత సావని, పి.దుర్గా సునీత, పి.వెంకటేష్, టి.నాగమణి, ఎం.వశిష్ట, ఆర్.వేణుమాధవి, టి.కరుణశ్రీ, సీహెచ్.ఆశ, ఎం.దివ్య, టి.నాగమణి ప్రతిభ చూపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా బోర్డు మారలే..



శుభ్రం చేసిన పార్కు వద్ద జగనన్న స్వచ్ఛసంకల్పం బోర్డు

కాతేరు చెరువు పార్కు బయట నిత్యం చెత్త, వ్యర్థాలతో నెలల తరబడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 11న 'పార్కుకి ఎలావెళ్లేది' శీర్షికన వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన కార్యదర్శి హనుమంతరావు పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీయించి బ్లీచింగ్ చల్లారు. కానీ చెత్త వేయకుండా జగనన్న స్వచ్ఛ సంకల్పం బోర్డు ఏర్పాటు చేయడంతో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా మాజీ సీఎం ఫొటోతో బోర్డు పెట్టడం ఏమిటని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు

అధ్వాన మార్గంతో అవస్థలు



బుర్రిలంక దుర్గమ్మగుడి వద్ద..

కడియపులంక పరిధిలోని బుర్రిలంక దుర్గమ్మ గుడి సమీపంలో బురదనీటితో నిండిన రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా ఉందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రాత్రి వేళ ఈ దారిలో ఉన్న గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సర్పంచి పాటంశెట్టి రాంజీని వివరణ కోరగా డ్రెయినేజీ సదుపాయం లేక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దాదాపు రూ.70లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు కోసం వేచి చూస్తున్నామన్నారు. రాగానే పనులు ప్రారంభించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కడియం

నీటి వృథా తీరని వ్యధ

బొమ్మూరు టిడ్కో గృహ సముదాయాలకు వెళ్లే దారిలో తాగునీరు నెలల తరబడి వృథాగా నేలపాలవుతుంది. పైపు లైను నుంచి వస్తున్న నీరు టిడ్కో ఇళ్ల వైపు పారుతుందని కాలనీవాసులు చెబుతున్నారు. దీంతో ఇళ్ల వద్ద బురదగా మారుతుందని వాపోతున్నారు. సమస్యపై కార్యదర్శి సూర్యనారాయణను వివరణ కోరగా సిబ్బందితో మరమ్మతులు చేయించి నీరు వృథా కాకుండా చూస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు



టిడ్కో గృహ సముదాయాల వద్ద..

హుష్.. మళ్లీ వర్షం

బిక్కవోలు, రంగంపేట, అనపర్తి గ్రామీణం, రాజానగరం: అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణం నియోజకవర్గాల్లో, గోకవరం మండలంలో శుక్రవారం విస్తారంగా వర్షం పడింది. బిక్కవోలులోని కాకినాడ- రాజమహేంద్రవరం రహదారిలో ఉన్న గోతుల్లో నీరు చేరి అధ్వానంగా తయారైంది. మెట్ట మండలమైన రంగంపేటలో వర్షం నీటితో చెరువులు నిండుకుండల్లా మారాయి. ఏడీబీ రోడ్డులో గోవిందరాజపురం వద్ద రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అనపర్తి మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజానగరంలో కోరుకొండ రోడ్డు నీట మునిగింది. పాదచారులు నీటిలోంచి వెళ్ళలేక రాజానగరం గ్రామంలోకి వెళ్లారు. దివాన్‌చెరువులో ఎన్‌హెచ్ నుంచి శ్రీరాంపురం వెళ్ళే రహదారి పూర్తిగా నీటమునిగి రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలలోకి నీరు చేరింది.



అనపర్తి బోనస్ వీధిలో..



గోవిందరాజపురం వద్ద ఏడీబీ రోడ్డుపై వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు



ముంపుబారిన పడిన దివాన్‌చెరువు - శ్రీరాంపురం రహదారి



అచ్యుతాపుర వద్ద బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీరు

కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

గోకవరం, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీతో అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా స్థానిక పాత తపాల కార్యాలయం పక్కన గల వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం దీక్షను చేపట్టారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు సందర్శించి సంఘీభావం తెలిపారు.

కళాశాల బస్సుకు..
త్రుటిలో తప్పిన ప్రమాదం

అనపర్తి గ్రామీణం: అనపర్తి రైల్వే ఫైవంతెనపై శుక్రవారం సాయంత్రం పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. మండపేటలోని ఒక ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు స్టీరింగ్ రాడ్ వదిలేయడంతో అదుపు తప్పి ఫైవంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టింది. కళాశాల నుంచి విద్యార్థులను అనపర్తి తీసుకొస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో అయిదు నుంచి ఏడుగురు విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారంతా సురక్షితంగా ఉండడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. బస్సు అదుపు తప్పిన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని పిల్లలను తమ వాహనాలపై ఇళ్లకు తీసుకెళ్లారు. బస్సు నిర్వహణ పట్టించుకోలేదని కళాశాల యాజమాన్యంపై ఆరోపణలు చేశారు. ప్రమాదం విషయం బస్సు ఇన్‌ఛార్జి దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థుల యోగ క్షేమాలు తెలుసుకోకుండా, బస్సు గురించి ఆరా తీస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై శ్రీను నాయక్ పరిశీలించారు. అయితే దీనిపై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

దుర్గంధం.. భరించలేకున్నాం..



మోరంపూడి నుంచి ఆవరోడ్డు వెళ్లే రహదారి నిత్యం చెత్త, వ్యర్థాలకు నిలయంగా మారుతోంది. ప్రజల సౌకర్యం కోసం వేసిన రోడ్డు వెంబడి ఇళ్లకు సంబంధించిన చెత్త పోగులతోపాటు బిల్డింగ్‌ల వద్ద ఉపయోగపడని కవర్లు, ఇతర సామగ్రి పడేస్తున్నారు. ఈ సమస్యపై పిడింగొయ్యి కార్యదర్శి రూప్ చంద్‌ను వివరణ కోరగా వ్యర్థాలు తొలగిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు

కోరుకొండ - రాజమహేంద్రవరం ప్రధాన రహదారిలో చెత్త పేరుకుపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి మలుపు దాటాక చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ చెత్త వేయకుండా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కోరుకొండ



భగత్‌సింగ్ జయంతి

బిక్కవోలు, న్యూస్‌టుడే: విప్లవ యోధుడు భగత్ సింగ్ జయంతిని కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి లక్షణాలతో జీవితంలో మార్పు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): జీవితంలో మార్పు రావాలంటే సహకారం, మంచితనం, క్రమశిక్షణ, సమయపాలన వంటి లక్షణాలతో సాధ్యమని రాజమహేంద్రవరం వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ స్వామి సేవానందజీ మహారాజ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద చికాగోలో ఉపన్యాస దినోత్సవ సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఖైదీలకు మానసిక పరివర్తన, ప్రేరణపై ఉపన్యసించారు. సంకల్ప బలముంటే ఏ వయసు వారైనా మారొచ్చన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

వసతుల కల్పనపై శ్రద్ధ వహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సత్యవతి

కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొవ్వూరు ఇన్‌ఛార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కొవ్వూరు పట్టణ పరిధిలోని మదర్‌థెరిసా వీధి బాలల పునరావాస కేంద్రం, ఔరంగాబాదులోని క్రిస్టియన్ ఛారిటబుల్ సొసైటీని శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లలు, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. భోజన వసతి, శుభ్రత, సౌకర్యాలపై ఆరా తీసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: సనాతన ధర్మ రక్షణ కోసం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా నిడదవోలులో జనసేన నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ ఆధ్వర్యంలో స్వామివారి సన్నిధిని శుద్ధి చేసి మెట్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు కె.పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

సబ్ రిజిస్ట్రార్‌గా సుందరరావు



కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానని సబ్ రిజిస్ట్రార్ కె.సుందరరావు అన్నారు. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం (గ్రామీణ పరిధి పిడింగొయ్యి) నుంచి ఆయన కొవ్వూరు రాగా ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఐ.వెంకటేశ్వరరావు అనంతపల్లి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సుందరరావును కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

విద్యుత్తుశాఖ ఏఈగా శ్రీనివాసు

తాళ్లపూడి: తాళ్లపూడి మండల విద్యుత్తుశాఖ ఏఈగా గారపాటి శ్రీనివాసు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సిటీ మీటర్స్ ఏఈగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన ఏఈ వెంకట్రావు దేవరపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురికి స్థానచలనం కలిగింది. ఉప తహసీల్దార్ కె.అజయ్‌బాబు గోపాలపురం బదిలీ కాగా, ఉండి నుంచి ఎన్.వీఎస్ నాయుడు ఇక్కడికి రానున్నారు. ఎన్నికల డీటీగా ఉన్న కుమార్‌సుందర్ చాగల్లు వెళ్లడంతో ఆ స్థానంలో కె.నిరంజన్, రీసర్వే డీటీగా ఉన్న సాంబశివరావు గోపాలపురం వెళ్లడంతో ఆయన స్థానంలో కె.ఆనందకుమార్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ హేమ రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. మరో సీనియర్ అసిస్టెంట్ కె.రామకృష్ణ తాళ్లపూడి బదిలీ కాగా కేశర్ పురం నుంచి జి.నాగేంద్ర కొవ్వూరు రానున్నారు.

నల్లజర్ల డీటీగా శాంతిప్రియ



నల్లజర్ల: నల్లజర్ల డిప్యూటీ తహసీల్దార్‌గా వల్లూరి శాంతిప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ధవళేశ్వరంలో ఉన్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి సాధారణ బదిలీలో ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన కిశోర్‌కుమార్ ఆకివీడు ఎలక్షన్ డీటీగా బదిలీపై వెళ్లారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ సిబ్బంది శాంతిప్రియను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాణసంచా నిల్వ చేస్తే కఠినచర్యలు


నిర్వాహకుడితో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల: అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ప్రకాశరావుపాలెం, తెలికిచెర్ల గ్రామాల్లో ఉన్న బాణసంచా స్థావరాలను ఆయన పరిశీలించారు. దీపావళి ముందు రోజు తగిన అనుమతులు వచ్చిన తర్వాతే భద్రత నియమాలు పాటించి బాణసంచా సామగ్రి విక్రయించుకోవాలన్నారు. ఆయన వెంట నల్లజర్ల సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీహరిబాబు ఉన్నారు.

స్వచ్ఛ కొవ్వూరు సంకల్పంతో..

దీర్ఘకాలిక వెతలపై దృష్టి



ముఖాముఖి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా తీరని సమస్యలు, సమకూరని నిధులు, పాలకుల అలసత్వం, అధికారుల పర్యవేక్షణా లోపాలు కొవ్వూరు పట్టణాన్ని వెక్కిరిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పుర కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన టి.నాగేంద్రకుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ఆయా అంశాలను ప్రస్తావించింది. మౌలిక వసతుల కల్పనలో ముందుంటామని, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపడతామని ఆయన అన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

గోదావరి శుద్ధి జల ప్రణాళిక..

గోదావరి జలాన్ని శుద్ధి చేసి పట్టణంలో ప్రతి ఇంటికీ ఇవ్వాలన్నది సంకల్పం. ఈ బృహత్తర కార్యక్రమానికి 2018లో శంకుస్థాపన చేసినా పనులు జరగలేదు. తాజాగా గోదావరి ఉపరితల జల పథకానికి ప్రణాళిక సిద్ధం చేశారు. వాటర్ వర్క్స్‌కు చెందిన 3 ఎకరాల స్థలం అవసరం కానుంది. గోదావరి నుంచి ఇన్‌టేక్ వెల్, ట్రీట్‌మెంట్ ప్లాంట్, పంపిణీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. పైపులైన్ల విస్తరణ 98 కిలోమీటర్లు జరగనుంది. ఏఐఐబీ ద్వారా రూ.58 కోట్లతో ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం మూడు బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నారు.

యార్డుకు స్థల అన్వేషణ..

గోదావరి తీరాన ఉన్న కొవ్వూరును డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. పంగిడిలో స్థలం ఇచ్చినా ప్రయోజనం చేకూరలేదు. చెత్త నుంచి సంపద సృష్టించే రీతిలో యార్డు కోసం స్థలాన్వేషణ చేస్తున్నారు. 5 ఎకరాల లోపు స్థలం దొరికితే దీర్ఘకాలిక వెతలు తీరతాయి. అప్పటివరకు ప్రస్తుతం చెత్త పోస్తున్న ప్రాంతంలోనే వాటిని సరిస్తున్నారు. రైల్వే బైపాస్ రోడ్డుకిరువైపులా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు పోయకుండా ప్రత్యేక నిఘా అమలు కానుంది. సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. సచివాలయాల వారీగా జవాబుదారీతనంతో స్వచ్ఛతకు చర్యలు తీసుకుంటారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వచ్చిన ఆటోల మరమ్మతులు చేయిస్తాం. జేసీబీ యంత్రం అందుబాటులోకి వచ్చింది.


వ్యర్థాల గుట్టలను వెనక్కి నెడుతున్న జేసీబీ

విద్యుత్తు కాంతులకు..

టోలుగేటు నుంచి గామన్ వంతెన వరకు విభాజకాల మధ్యలో 320 విద్యుద్దీపాలను పునరుద్ధరించారు. కొత్తగా ఏర్పాటైన 80 విద్యుత్తు స్తంభాలకు దీపాలను అమరుస్తున్నాం. మొత్తంగా 2,250 దీపాలకు గాను 350 చోట్ల మరమ్మతులు అవసరం. 14 స్తంభాలపై ఉన్న 10 హైమాస్టు దీపాలను మార్చాల్సి ఉంది. వీటి నిర్వహణ [illegible] ఇంజినీరింగ్ కార్యదర్శులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నాం. పురపాలక రిజర్వు స్థలాలు [illegible] చేయించడంతో పాటు దాతల పేరుతో ఏర్పాటైన స్మారక ఉద్యానవనాలకు పూర్వ వైభవం తేనున్నాం. టోలుగేటు నుంచి ఏటిగట్టుపై గామన్ వంతెన సమీపం వరకు విద్యుద్దీపాలను [illegible]. సత్యవతినగర్, రాజీవ్‌కాలనీలో స్థలాలను [illegible] 'రుడా' ద్వారా వచ్చే నిధులతో [illegible].

క్షేత్రంలో సదుపాయాలకు..

గోష్పద క్షేత్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపనున్నాం. రేవులో ఒండ్రు మట్టి, నాచు తొలగించి విద్యుద్దీపాలను అమరుస్తాం. అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి చర్యలు తీసుకుంటాం. క్షేత్ర ప్రాంగణం శుభ్రత, ఆక్రమణ కట్టడాల నియంత్రణపై దృష్టి సారిస్తాం.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మోర్త రెండో నంబరు పాఠశాలలో విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను శుక్రవారం అందజేశారు. విద్యా కమిటీ ఛైర్మన్ మైనం భవాని, ఎం.గాంధీ, మల్లేశ్వరరావు, కూటమి నాయకుడు చల్లిది హనుమంతు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


అందుకున్న పుస్తకాలతో విద్యార్థులు

పశివేదల సొసైటీ సర్వసభ్య సమావేశం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పశివేదల శ్రీరంగరాయ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని పర్సన్ ఇన్‌ఛార్జి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. 2023-24 ఏడాదికి సంబంధించిన ఆడిట్ రిపోర్టును ఆమోదించారు. నికర లాభం నుంచి 15 శాతం షేరుధనాన్ని డివిడెండ్‌గా చెల్లించేందుకు తీర్మానించారు. సేకరించిన డిపాజిట్లు, సభ్యులు చెల్లించిన రుణాలను తెలియజేశారు. నివేదికను సంఘ కార్యదర్శి కరుటూరి శ్రీనివాసరావు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గారపాటి శ్రీనివాసరావు, రామచంద్రరావు, పరిమి సోమరాజు, రైతులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ హుండీ ఆదాయం రూ.20.85 లక్షలు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయశాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజనకుమార్ పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. 92 రోజులకు గాను మొత్తం రూ. 20,85,636 ఆదాయం వచ్చింది. దీనిలో భాగంగా హుండీ ద్వారా రూ.19,64,972, అన్నదాన ట్రస్ట్ హుండీ ద్వారా రూ.1,20,664 ఆదాయం వచ్చింది. 10 గ్రాముల బంగారం, 205 గ్రాముల వెండి వచ్చింది. కార్యక్రమంలో సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఛైర్మన్ ఆదినారాయణ ఒప్పందం విస్మరించారు'

నిడదవోలు: నిడదవోలు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని వైకాపా కౌన్సిలర్లు బహిష్కరించిన అనంతరం బయట విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఎంపిక విషయంపై అప్పట్లో ఒక ఒప్పందం జరిగిందని.. దాని అమలుకు ఛైర్మన్ ఆదినారాయణ సుముఖత చూపడం లేదని కామిశెట్టి వెంకటసత్యనారాయణ అన్నారు. గత ఒప్పందం ప్రకారం ఆదినారాయణకు రెండున్నరేళ్లు, తనకు రెండేళ్లు, అనంతరం మిగిలిన కాలం రతీదేవికి ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఒప్పందం జరిగిందన్నారు. ఇప్పటికే మూడున్నరేళ్లు అయినా ఆదినారాయణ రాజీనామా చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. అలాగే కౌన్సిలర్లకు తెలియకుండానే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నాటి నుంచి అజెండాలోకి అంశాలను తేవడం, కౌన్సిలర్లు ఆయనతో మాట్లాడేందుకు వెళ్లినా కలవకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. గతంలో ఆయనే విలేకరుల సమావేశాన్ని పెట్టి ఈ ఒప్పంద విషయాన్ని ప్రకటించారన్నారు. తనకు, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుకు మధ్య కొన్ని వ్యవహారాలు ఉన్నాయని.. అవి సర్దుబాటు అయిన తక్షణమే రాజీనామా చేస్తానని చెప్పారన్నారు. ఆ వ్యవహారాలు సర్దుబాటు అయినా రాజీనామా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ కురుమూర్తి జాన్‌బాబు మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో తన వార్డులో ఒక్క వీధి దీపం గాని, రహదారి, మురుగుకాలువ గాని నిర్మించలేకపోయామన్నారు. సమావేశాలకు వచ్చి సమోసా, బిస్కెట్ తిని టీ తాగి వెళ్లడమే తప్ప అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. కౌన్సిలర్ పువ్వల రతీదేవి మాట్లాడుతూ ఛైర్మన్ ఒంటెత్తు పోకడల కారణంగా కౌన్సిలర్లు ఆయా వార్డు ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేకపోయామన్నారు. పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.6 లక్షల విరాళం


ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న చిక్కాల గ్రామస్థులు, నాయకులు

చాగల్లు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి స్పందన రావడం ప్రజల దాతృత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చిక్కాల గ్రామం నుంచి వరద బాధితుల సహాయార్థం కూటమి నాయకులు, గ్రామస్థులు సేకరించిన రూ.6,06,666ల చెక్కును ఎమ్మెల్యేకు శుక్రవారం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నా పట్టించుకోకుండా ఆపదలోని వారిని ఆదుకోవాలని నాయకులు విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, యంట్రప్రగడ అబ్బులు చౌదరి, విటికెన పెంటారావు, బి.బాబూరావు, కె.రామ్మూర్తి, నాయుడు శ్రీను, కొండేటి కేధార్‌నాథ్, సంసాని నరసింహమూర్తి, కేతా సత్యనారాయణ, పిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరా..?



యర్నగూడెం శివారులో పాత జాతీయ రహదారిని ఆనుకుని వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. రాకపోకలు సాగించే క్రమంలో ఈ చెత్త వాహనాల్లో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. పందులు, శునకాలు చెత్తచెదారాలను రహదారిపైకి లాక్కొస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త వేయకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎం.రాణిని వివరణ కోరగా సమస్యను పరిశీలించి రెండు రోజుల్లో వ్యర్థాలను తొలగింపజేస్తామన్నారు. - న్యూస్‌టుడే, దేవరపల్లి

ప్రయాణానికి పాట్లు



మండలంలోని మోర్త నుంచి వెలగదుర్రు, అజ్జరం మీదుగా పెరవలి వెళ్లే రహదారి గోతులమయంగా తయారైంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి మరమ్మతు పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరగా పరిశీలించి రహదారికి మరమ్మతు పనులు చేయిస్తామని ఏఈ శ్రీనివాసు తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

బాధితులకు అండగా నిలిచిన ఘనత చంద్రబాబుదే

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తులో చిక్కుకున్న బాధితులకు తోడుగా నిలిచి తక్షణం పరిహారం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలతో విజయవాడ అతలాకుతలం కాగా ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 9వ తేదీ వరకు ముఖ్యమంత్రి కలెక్టరేట్‌ను కార్యాలయంగా చేసుకుని బాధితులతో ఉన్నారన్నారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులను రప్పించి సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చేయించారన్నారు. 20 రోజులు పూర్తికాక ముందే వరద నష్టాన్ని అంచనా వేయించి బాధితులకు రూ.602 కోట్లు సాయాన్ని అందించారన్నారు. ఆయన పిలుపుతో దాతలు, ప్రముఖులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించిన తీరు ప్రశంసనీయమన్నారు. సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, రాజాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా

చాగల్లు, న్యూస్‌టుడే: ధాన్యాన్ని రవాణా చేసే సమయంలో రైతు కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం వారికి నచ్చిన మిల్లును ఎంచుకునే అవకాశం ఇచ్చినట్లు చాగల్లు మండల ప్రత్యేకాధికారి పి.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. తూనికలు, కొలతల సిబ్బంది రైసు మిల్లుల వద్ద ఉన్న కాటాలను పరిశీలించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: వరి సాగులో సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నర్సింహరావు, ప్రధాన శాస్త్రవేత్త డా.మానుకొండ శ్రీనివాసు అన్నారు. మండలంలోని పసలపూడిలో సార్వాకు సంబంధించి వరిపైరును క్షేత్రస్థాయిలో అధికారులు బృందంగా శుక్రవారం పరిశీలించారు. ఎండాకు తెగులు, దోమల నివారణకు రైతులకు సూచనలిచ్చారు. డీఆర్‌పీ జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, రైతులు పాల్గొన్నారు.


పసలపూడి పొలంలో ప్రదర్శన చేస్తున్న అధికారులు

తూర్పు చోడవరంలో రూ.30 లక్షలతో జల్‌జీవన్ పనులు

నల్లజర్ల, న్యూస్‌టుడే: తూర్పు చోడవరంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మూడు కిలోమీటర్ల మేర సురక్షిత తాగునీటి పైపులు వేసేందుకు రూ.30 లక్షలు మంజూరైనట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గిరి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ప్రతీ గ్రామంలో తాగునీటిని అందించేందుకు ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన ట్యూబ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. డీఈ అప్పారావు, ఏఈ అజయ్‌బాబు, సర్పంచి వెంకటలక్ష్మి, ఉప సర్పంచి ఉండవల్లి గోపి, ఉప్పు నరేష్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గిరి

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భర్త అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు భార్య శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణ పరిధి గౌతమినగర్‌లో నివాసం ఉంటున్న సాజిపల్లి దుర్గారావు ఐస్ క్రీం దుకాణం నడుపుతున్నారు. ఈ నెల 26న సాయంత్రం 6.30 గంటల సమయంలో బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. అతని చరవాణి, ఆధార్, బ్యాంకు కార్డులు ఇంట్లో వదిలి వెళ్లారు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. భార్య శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ సీఐ విశ్వం కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు

చాగల్లు, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భార్య తిరిగి రాలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాగల్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందిగంపాడు గ్రామానికి చెందిన కె.లలిత ప్రియ ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లారు. బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త ప్రసాద్ చాగల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

దేవరపల్లి, న్యూస్‌టుడే: వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని, రైతులు సహకరిస్తే మరింత అభివృద్ధి చెందుతాయని సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి ఉషారాణి తెలిపారు. దేవరపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజనసభ శుక్రవారం జరిగింది. ఉషారాణి మాట్లాడుతూ దేవరపల్లి సహకార సంఘం రుణాలతోపాటు ఇతర వ్యాపార రంగంలోనూ అభివృద్ధి సాధించిందన్నారు. సొసైటీ పరిధిలో రైతులకు అవసరమైన విత్తనాలను సరసమైన ధరలకే అందిస్తున్నామన్నారు. సంఘంలో 1,222 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని 790 మందికి రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మాజీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాస్, రైతు నాయకులు కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, యాగంటి బుల్లబ్బాయి, సుంకర సుబ్రహ్మణ్యం, కవల బాబూరావు, గేలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి ఉషారాణి


వర్షంతో కొవ్వూరు రైలు వంతెన కింద ఆగిన ప్రయాణికులు

ముంచెత్తిన వర్షం

కొవ్వూరు పట్టణం, పెరవలి, న్యూస్‌టుడే: కుండపోతగా కురిసిన వర్షం కొవ్వూరు ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసింది. రోజువారీ పనుల కోసం బయటకు రాలేని పరిస్థితి ఎదురైంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో కొవ్వూరు పట్టణం ముంపు బారిన పడింది. పల్లపు ప్రాంతాలు చెరువులను తలపించాయి. మెరకవీధి నుంచి విజయవిహార్ కూడలి వరకు ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి జనజీవనం స్తంభించింది. ● పెరవలిలో పడిన వర్షానికి డ్రెయిన్లు నిండి రహదారులు జలమయం అయ్యాయి. మెట్టరైతులు వర్షానికి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.విఘ్నేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సరిదే వీరవెంకట సత్యభాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఏలూరు భిశ్వనాథ్ భర్తియా స్విమింగ్ పూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్-17 పోటీల్లో 9వ తరగతి చదువుతున్న ఎం.లోకేష్, బి.దుర్గాప్రసాద్‌లు ప్రతిభ చూపారన్నారు. పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

చాగల్లు: దేవరపల్లి మండలం పల్లంట్లలో నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు తెలిపారు. లావణ్య, సింధు, పావనిలు రాష్ట్రసాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

పంట నమోదు తప్పనిసరి

గోపాలపురం, న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. గడిచిన 60 రోజుల నుంచి వ్యవసాయ, ఉద్యాన క్షేత్రస్థాయి సిబ్బంది ఈ-పంట నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు చేసిన ప్రక్రియ సక్రమంగా ఉందో లేదో తెలుసుకోవడం కోసం మండలంలోని పలు పంటలను మాధవరావు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కోమటికుంట సమీపంలో ఉన్న గెడా జోగేంద్రప్రసాద్ వరి పొలాన్ని ఆయన పరిశీలన చేశారు. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న చెరుకు, వరి పంటల వివరాలు రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.రాజారావు, శ్రీనివాస్, క్షేత్రస్థాయి సిబ్బంది మణికంఠ, మధు తదితరులు పాల్గొన్నారు.


కోమటికుంటలో ఈ-పంట నమోదైన పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి